అ'పూర్వ' ఆదరణ

- ప్రభుత్వ కళాశాలకు దాతల చేయూత
- పూర్వ విద్యార్థుల సహకారంతో సౌకర్యాలు
- మెరిట్ విద్యార్థులకు ప్రత్యేక బహుమతులకోసం నిధి
- జయీభవ పేరుతో పోటీపరీక్షలకు తరగతులు


ప్రభుత్వ జూనియర్ కళాశాల ముఖద్వారం

తిరువూరు: దాతలు, ప్రభుత్వ సహకారంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అదనపు హంగులు సమకూరుతున్నాయి. కళాశాలలో చదువుకుని ఉన్నత పదవుల్లో ఉన్నవారు, దేశవిదేశాల్లో ఉన్న వారు స్వచ్ఛందంగా ఈ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ కళాశాలలో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ గ్రూపులతో పాటు వృత్తివిద్యా కోర్సులను కూడా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ప్రైవేటు కళాశాలల నుంచి తీవ్ర పోటీ ఉన్నప్పటికీ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు ఇంటింటికీ తిరిగి విద్యార్థులను చేర్చుకుంటున్నారు. కళాశాలకు ఉన్న పురాతన భవనాలను తొలగించి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 కోట్ల నిధులతో ఆధునిక తరగతి గదులు, పాలనా భవనం, ప్రయోగశాలలను నిర్మించారు. నాడు–నేడు నిధులు మరో రూ.58 లక్షలతో మరిన్ని అదనపు హంగులు సమకూరనున్నాయి.

దాతల సహకారం ఇదీ..

ఈ కళాశాల పూర్వ విద్యార్థి వేమూరి కనకదుర్గా ప్రసాద్ విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించేందుకు రూ.లక్ష విరాళంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. కళాశాల అధ్యాపకుడు వీ అజయ్ రూ.40 వేలతో ఆడియో, వీడియో సౌకర్యం కల్పించారు. ప్రవాసాంధ్రుడు ఆర్.నరసింహారావు రూ.1.25 లక్షల విలువైన కంప్యూటర్లను విద్యార్థుల ప్రయోగశాలకు విరాళం ఇచ్చారు. రూ.25 వేల వ్యయంతో వాసవీ క్లబ్ నిర్వాహకులు స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయగా, తిరువూరు స్వర్ణకారుల సంక్షేమ సంఘం సభ్యులు రూ.15 వేలతో గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను సమకూర్చారు. మలబార్ గోల్డ్ సంస్థ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా 60 మందికి రూ.5.50 లక్షల చొప్పున స్కాలర్‌షిప్పులు అందజేస్తోంది.

పోటీ పరీక్షలకు కూడా..

ఇంటర్మీడియెట్ స్థాయిలోనే ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు విద్యార్థులను అధ్యాపకులు సన్నద్ధం చేస్తున్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధనకు ప్రవేశపెట్టిన జయీభవ కార్యక్రమంలో ప్రత్యేక తరగతులను కూడా తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. గతేడాది ఇంటర్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు స్ఫూర్తిగా ఈ ఏడాది నూరుశాతం ఫలితాలు సాధించడానికి ప్రయత్నిస్తున్నారు.


తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రయోగశాలకు పరికరాల వితరణ (ఫైల్)


తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతలు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

దాతల ఔదార్యం మరువలేం..



పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం కల్పించే సౌకర్యాలకు అదనంగా దాతల సహకారం కోరుతున్నాం. ఇప్పటికే పూర్వ విద్యార్థులు, ఉన్నతోద్యోగులు తమవంతు సహాయ సహకారాలు అందించారు. ఇక్కడ చదివి మంచి స్థాయిలో ఉన్న ప్రతి విద్యార్థి కళాశాల అభివృద్ధికి తోడ్పడాలి.

– మురళీకృష్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తిరువూరు

క్లుప్తంగా

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన సీఐ కిషోర్



ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను మైలవరం పోలీస్ స్టేషన్ సీఐ కిషోర్‌బాబు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈమేరకు శాలువాతో సన్మానించి ఆక్సిజన్ మొక్క అందజేశారు. విధుల్లో చేరినట్లు తెలియజేసి పరిచయం చేసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులు, మహిళలను పోలీస్ స్టేషన్‌లో గౌరవించాలని సూచించారు. విధి నిర్వాహణలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని సీఐ తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కొణిజెర్ల(గంపలగూడెం): మండలంలోని కొణిజెర్ల కనకదుర్గమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు లక్ష్మీ నారాయణాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి ఆహ్వానం

మైలవరం: మండలంలోని బొర్రగూడెంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల దేవస్థానమునకు ధర్మకర్తల మండలి నియామకం కొరకు కాకినాడ ఉప కమిషనర్, దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రకటన విడుదల చేసినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.సాంబశివరావు సోమవారం తెలిపారు. చట్టం 33/2007 ప్రకారం 31/2019 సెక్షన్ 17(3) నియమాల ప్రకారం ఫారం నంబర్–2 ద్వారా ఉప కమిషనర్, దేవదాయశాఖ కాకినాడ వారికి దరఖాస్తు చేసుకోవలసిందిగా తెలిపారు. దరఖాస్తు ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో సెల్ నంబర్ 9160614455 సంప్రదించాల్సిందిగా తెలిపారు.

వేర్వేరు కేసుల్లో 16 మంది అరెస్ట్

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలో నిర్వహిస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై ఆదివారం రాత్రి 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. కొండపల్లి పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహిస్తున్న పేకాట శిబిరంలో 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.11,270 నగదు స్వాధీనం చేసుకున్నారు. అడవి క్వారీలో మరో పేకాట శిబిరం వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.12,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. పైడూరుపాడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మట్టకొయ్య వెంకటేశ్వరరావును అరెస్ట్‌చేసి అతని వద్ద 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పాపారావు పర్యవేక్షణలో కేసునమోదు చేపట్టినట్లు సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి వితరణ



మెట్టగుట్ట(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను శివారు మెట్టగుట్టపై నెలకొని ఉన్న శేషాచల శ్రీనివాసస్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి ఇరువురు భక్తులు సోమవారం రూ.లక్ష వితరణగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన పొట్టి జానకిరామయ్య, అనసూర్య దంపతులు రూ.50 వేలు, పొట్టి వేణుగోపాలరావు (కృష్ణ), కృష్ణకుమారి దంపతులు రూ.50 వేలు ఇచ్చారు. ఈ మొత్తాన్ని వారి బంధువు పొట్టి పున్నయ్య ద్వారా దేవాలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాపరెడ్డికి అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం గుంటూరు జిల్లా నకిరికల్లు గ్రామానికి చెందిన రేలంగి ఊర్మిల వారి కుమార్తె విజయలక్ష్మి పేరు మీద రూ.10,116లు విరాళంగా అందజేశారు. ఆలయ పాలకమండలి డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా అధికారులకు విరాళాన్ని అందజేశారు.ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి


నూజివీడులో అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ వై.భవానీశంకరి

నూజివీడు: 'స్పందన'లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు గడువులోగా పరిష్కరించాలని ఆర్డీఓ వై.భవానీశంకరి ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదన్నారు. స్పందనలో మొత్తం 11 అర్జీలు రాగా, వాటిలో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ విద్యాసాగర్, డీఎల్‌డీవో వెంకటరత్నం, పలువురు డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఆరు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. వ్యవసాయ శాఖకు సంబంధించి రెండు, రెవెన్యూ శాఖకు చెందిన ఫిర్యాదులు నాలుగు వచ్చినట్లు ఆమె వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ రాధికా రాణి, వ్యవసాయ అధికారి బి.సాయిశ్రీ, ఎంఈఓ పీవీడిఎల్ నరసింహారావు, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తాం

కృష్ణా జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కేవీ రామకృష్ణయ్య


సబ్‌జైలులో ఖైదీల వివరాలు సేకరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య

నూజివీడు: రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని పక్షంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తామని కృష్ణా జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌జైలును సోమవారం సందర్శించిన ఆయన రిమాండ్ ఖైదీల వివరాలను తెలుసుకున్నారు. వారితో మాట్లాడి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మైనర్లుగా ఉండి నేరాలు చేసి సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉండి ఉంటే వారిని జువైనల్ హోంకు పంపించడం జరుగుతుందని, అక్కడ విచారణ సైతం వేగవంతంగా నిర్వహించి కేసును త్వరితగతిన పరిష్కరిస్తారన్నారు. రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారికి బెయిల్ వచ్చినా జామీను ఇచ్చేవారు లేక రిమాండ్‌లోనే ఉన్న ఖైదీల వివరాలను సేకరించారు. ఈ వివరాలను జిల్లా స్థాయిలో ఉండే కమిటీకి పంపినట్లయితే కమిటీ ఆధ్వర్యంలోనే చిన్నచిన్న కేసులకు సంబంధించి మాత్రమే జామీనును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సబ్‌జైలులో అందుతున్న సదుపాయాలు, భోజనం తదితర వాటి గురించి జడ్జి రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. జడ్జి వెంట స్థానిక రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కే హరిబాబు, డిప్యూటీ జైలర్ గంగినేని ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు


ఆర్ వెంకటరామిరెడ్డి


సుగుణ


ఎస్ఐ అనూష


బండి మృత్యుంజయరావు


టీఆర్ రాజేశ్వరరావు


తహసీల్దార్ సుజాత

మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి

నూజివీడు: నూజివీడు పురపాలక సంఘం కమిషనర్‌గా ఆర్.వెంకటరామిరెడ్డి సోమవారం బాధ్య తలు స్వీకరించారు. ఈయన నంద్యాల జిల్లా డోన్ మున్సిపాలిటీకమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న సయ్యద్ అబ్దుల్ రషీద్ ప్రకాశం జిల్లా అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పాలకవర్గం, ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌ల సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.కమిషనర్‌ను కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గంపలగూడెం తహసీల్దార్‌గా సుగుణ

గంపలగూడెం: మండల తహసీల్దార్‌గా డి.సుగుణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీల్లో భాగంగా ఆమె రాజమండ్రి నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన బాలకృష్ణారెడ్డి కాకినాడ తొండంగి మండలానికి బదిలీ అయ్యారు.

ఎస్ఐగా అనూష బాధ్యతల స్వీకారం

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బి.అనూష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు గుంటుపల్లి సెక్టార్ ఎస్ఐగా పనిచేసిన ఎస్ఐ జి.విజయలక్ష్మి కాకినాడకు బదిలీపై వెళ్లారు. మూలపాడు సెక్టార్ ఎస్ఐ ధర్మరాజు చందర్లపాడు ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనూషకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆగిరిపల్లి తహసీల్దార్‌గా మృత్యుంజయరావు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి తహసీల్దార్‌గా బండి మృత్యుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన ఉదయభాస్కర్ కాకినాడ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

మైలవరం తహసీల్దార్‌గా రాజేశ్వరరావు

మైలవరం: మండల తహసీల్దార్‌గా టీఆర్ రాజేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నుంచి బదిలీపై మైలవరం వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై దృష్టి పెడతామన్నారు. సిబ్బంది, పోలీసులు, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

తహసీల్దార్‌గా సుజాత

విస్సన్నపేట: సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీల ప్రక్రియలో విస్సన్నపేట తహసీల్దార్‌గా ఎం.సుజాత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో కడియం తహసీల్దార్‌గా పనిచేశారు. విస్సన్నపేట తహసీల్దార్‌గా చేసిన చంద్రశేఖర్ ఉద్యోగోన్నతిపై వెళ్లారు.

సీఎంను విమర్శించే స్థాయి వసంతకు లేదు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత మేడపాటి నాగిరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి అన్నారు. ఐతవరంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వంపై ఎమ్మెల్యే వసంత చేసిన విమర్శలను ఇబ్రహీంపట్నంలో సోమవారం ఖండించారు. రెండు సార్లు ఓడిపోయిన మీరు మైలవరంలో ఎమ్మెల్యేగా గెలిపించిన ఘనత ప్రజలకు, సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీపై అభిమానంతో సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు గెలుపొందారన్నారు. ఇందులో మీ ప్రమేయం ఏమీ లేదన్నారు. ప్రభుత్వం, మంత్రి జోగి రమేష్‌పై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్నబోసు, కౌన్సిలర్ చంద్రం, వైఎస్సార్ సీపీ నాయకులు కోమటి కోటేశ్వరరావు, సుబ్బారావు, మధుబాబు, జోజి తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి


బొద్దనపల్లిలో మామిడి పూతను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాధారాణి

ఆగిరిపల్లి: మామిడిలో సస్యరక్షణ చర్యలు పాటించాలని మ్యాంగో రీసెర్చ్ స్టేషన్ ప్రధాన శాస్త్రవేత్త రాధారాణి అన్నారు. మండల పరిధిలో బొద్దనపల్లిలో మామిడి పూత, పిందే దశలో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాధారాణి మాట్లాడుతూ కలతారును విపరీతంగా వాడటం వలన భూసారం తగ్గుతుందని, పెరుగుదల ఆపి వేస్తున్నందున వినియోగం తగ్గించాలని సూచించారు. కలతారుకు బదులుగా అక్టోబర్ మాసంలో మల్టీ–కె వాడితే సమానంగా పూత వస్తుందన్నారు. ఎండు పుల్లలను తోటలో ఎప్పటికప్పుడు తీసివేయాలని, కొట్టిన మందులను పదేపదే వినియోగించవద్దని సూచించారు. పూత సమయంలో తేనెమంచు పురుగులు ఉధృతి ఎక్కువైతే వాటికి ఇమిడోక్లోరోఫిడ్ ద్రావణాన్ని 0.3 ఎంఎల్ పూత, పిందె సమయంలో ఆకులపైన కాకుండా మొదళ్లపై కొమ్మలపైన పిచికారీ చేయాలన్నారు. మరిన్ని సస్యరక్షణ చర్యలు, నివారణ కోసం మండల ఉద్యాన శాఖ అధికారిని రైతులు సంప్రదించాలన్నారు. మండల ఉద్యానశాఖ అధికారిణి కే జ్యోతి ప్రియాంక, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల కమిటీ సమావేశం

తిరువూరు: బీజేపీ తిరువూరు నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎన్నికల కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కోకన్వీనర్ అన్నవరపు క్రాంతి కుమార్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు అబ్బూరి శ్రీరామ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జి.కొండూరు: అప్పులబాధ భరించలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. వివరాలలోకి వెళ్తే..జి.కొండూరు మండల పరిధి దుగ్గిరాలపాడు గ్రామానికి చెందిన బొల్లినీడు తిరుపతిరావు (34)కు వివాహమై భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా తిరుపతిరావు వృత్తిరీత్యా గొర్రెలను క్రయ విక్రయాలు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అధికంగా అప్పులు చేసిన తిరుపతిరావు తిరిగి చెల్లించలేక ఆదివారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తిరుపతిరావును విజయవాడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 11గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి భార్య వెంకటనర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన పచ్చల వెంకట్రామయ్య 25వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పచ్చల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం మండలస్థాయి క్రికెట్‌పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖరరావు హాజరై క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. సీఐ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సర్పంచి బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మినేని భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్‌కు 700 మంది హాజరు

జగ్గయ్యపేట అర్బన్: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. స్థానిక జేఆర్సీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్ష పేపర్‌ను జేఆర్సీ విద్యా సంస్థల చైర్మన్, డైరెక్టర్ ఆర్.మణికంఠ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పెనుగొండ వెంకట్రావు, యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎం.కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో మోడల్ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 700 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు.

ఆగిరిపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా నరసింహారావు


బాధ్యతలు స్వీకరించిన పల్లగాని నరసింహారావుతో డైరెక్టర్లు, నాయకులు


చెక్కపల్లి సొసైటీ వద్ద నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా చొటుపల్లి అంజయ్య, జ్యోతుల దానకర్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పల్లగాని నరసింహారావుకు పలువురు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

చెక్కపల్లి సొసైటీ..

ముసునూరు: రైతులకు సత్వర సేవలందించడంలో వ్యవసాయ సొసైటీని మరింత ప్రయోజనకారిగా తీర్చిదిద్దాలని జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ నూతన త్రిసభ్య కమిటీ సభ్యులకు సూచించారు. చెక్కపల్లి వ్యవసాయ సొసైటీ ప్రాంగణంలో మాజీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన అధ్యక్షతన సీనియర్ వైఎస్సార్ సీపీ నేత కాటేపల్లి లింగరావు అధ్యక్షుడిగా, జాలా ప్రభుదాస్, సర్నాల సుజాత సభ్యులుగా త్రిసభ్య కమిటీతో సొసైటీ సీఈవో దుర్గారావు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఉప సర్పంచ్ పద్మజా దేవేంద్ర, ఎంపీటీసీ తోట రమాదేవి మురళి, మాజీ డైరెక్టర్‌లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

డయాలసిస్ పింఛన్ అందజేత


ఆరుగొలనుపేటలో డయాలసిస్ పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ అప్పిరెడ్డి

చాట్రాయి: మండలంలోని ఆరుగొలనుపేట గ్రామానికి చెందిన కలపాల సారమ్మ కొద్దికాలం నుంచి షుగర్, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతోంది. రక్త మార్పిడికి చాలా ఖర్చు కావడంతో అంత ఆర్థిక స్తోమత లేక డయాలసిస్ పింఛన్‌కు దరఖాస్తు చేసుకుంది. దీంతో కొత్తగా మంజూరైన డయాలసిస్ పింఛన్ రూ.10 వేల నగదుని గ్రామ సర్పంచ్ పుచ్చకాయల అప్పిరెడ్డి చేతుల మీదుగా సోమవారం సారమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

ముసునూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ, నోడల్ అధికారి పద్మావతి దేవి, వైద్యాధికారి కరీముల్లా సోమవారం పిలుపునిచ్చారు. చింతలవల్లి సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వైద్యశిబిరంలో ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు కరీముల్లా, అవినాష్, షకీనా ఇవాంజిలిన్, ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.

మైలవరం ఇన్‌చార్జిని కలిసిన యువజన విభాగం నేత


మైలవరం ఇన్‌చార్జి తిరుపతిరావుతో మాట్లాడుతున్న కిరివి చైతన్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): మైలవరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమితులైన సర్నాల తిరుపతిరావు యాదవ్‌ను ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య (వర) మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం చైతన్య వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి తిరిపతిరావు యాదవ్ ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభు, విజయ్, ధనుష్, చెన్నకేశవ,సాగర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు

నందిగామ: త్యాగరాజస్వామి వారి 15వ ఆరాధన మహోత్సవాలను నందిగామ పట్టణంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. త్యాగరాజస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం త్యాగరాజస్వామి వారి చిత్రపటాన్ని మేళతాళాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం ముక్కోటి మండపంలో కళాకారులచే నాదస్వర కచేరీ నిర్వహించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రెడ్డిగూడెం: మండలంలోని రంగాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.తబిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి ఐదవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఫిబ్రవరి 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన జరుగుతుందన్నారు. అర్హత ఉన్న విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తిరువూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తిరువూరు గురుకుల పాఠశా ప్రిన్సిపాల్ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది 4వ తరగతి చదివే విద్యార్థులు 5లో చేరడానికి, 10వ తరగతి చదివే విద్యార్థులు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలోకి ప్రవేశించడానికి అర్హులని తెలిపారు. మార్చి 10న ఉదయం 5వ తరగతి, మధ్యాహ్నం ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ నెల 23వ తేదీ లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.